## విద్యార్థిని ఆత్మహత్య..!



గంగవరం, జనవరి 23, ప్రభాతవార్త : ఓ విద్యార్థిని ఇంటిలో ఎవరు లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమ వారం మండలంలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం మేరకు..మండలంలోని మన్నార్‌నాయనపల్లె గ్రామానికి చెందిన ఉదయ్‌కుమార్ రెండవ కుమార్తె శ్రీవాణి(20)అనే విద్యార్థిని మండలంలోని ఓ ప్రైవేటు కళాశాలలో బి.కామ్ తృతీయ సంవ త్సరం చదువుతుంది.ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో శ్రీవాణి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీ సులు సంఘటన స్థలాన్ని పరిశీలించి విద్యార్థిని ఆత్మహత్యపై కుటుంబ సభ్యులను విచారించగా విద్యార్థిని తండ్రి ఉదయ్‌కుమార్ గత రెండు రోజులుగా తమ కుమార్తె సెల్‌కు ఓ గుర్తుతెలియని యువకుడు పదేపదే ఫోన్ చేయడం గమనించామని,తమ కుమార్తె ఆత్మహత్య చేసుకున్న తరువాత కూడా తన సెల్ వరుసగా మ్రోగుతూనే ఉందని పేర్కొన్నాడు. మృతదేహన్ని శవ పరీక్ష నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త



## స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించండి

–తిరుపతిజిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి



*తిరుపతిరూరల్, జనవరి23 ప్రభాతవార్త:* స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వెంకట రమణారెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 112 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. స్పందన కార్యక్రమ అర్జీలకు ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, అర్జీలపై తరచూ సమీక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జె.సి. డి.కె. బాలాజీ, డిఆర్వో శ్రీనివాసరావు, గాలేరు-నగరి సుజల స్రవంతి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవాణి నిధులు

# దుర్వినియోగం కాదు

**అత్యుత్సాహంతో డ్రోన్‌తో ఆలయాన్ని చిత్రీకరించారు**

**నిరాదరణ ఆలయాల దూపదీపనైవేద్యాలకు రూ.5వేలు**

**సామాజిక సేవా సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట :టిటిడి ఇఓ**



తిరుమల,జనవరి 23ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవాణి ట్రస్ట్‌కు సంబంధించి దాతలైన భక్తులు బ్రేక్ దర్శనాల కోసం ఇచ్చే నిధులు ఎప్పుడూ ఎన్నటికీ దుర్వినియోగం కాదని, పక్కదారిపట్టడానికి వీలులేదని టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి స్పష్టం చేశారు. శ్రీవాణిట్రస్ట్ నిధులపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అవాస్తవాల ప్రచారంపై సోమవారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి, జెఇఓ వీరబ్రహ్మాం, సివిఎస్ఓ నరసింహకిశోర్, సిఇ నాగేశ్వరరావు, పిఆర్ఓ డాక్టర్ తలారి రవి,ఏపిఆర్ఓ నీలిమతో కలసి మీడియాప్రతినిధుల సమావేశంనిర్వహించారు. అనంతరం ఇఓ ధర్మారెడ్డి మాట్లాడుతూ ఇటీవల ఏడుకొండల వెంకన్న ఆలయాన్ని డ్రోన్‌తో చిత్రీకరించిన విషయంపై ఇందుకు సంబంధించి ఐఓసికి అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. ఐఓసి సిబ్బంది అత్యుత్సాహంతో ఆలయాన్ని చిత్రీకరించింది వాస్తవమేనని ఇఓ సంచలన వ్యాఖ్యలు చేశారు. అయినా ఆలయ పవిత్రత ,భద్రతకు సంబంధించిన అంశం కావున ఐఓసి సిబ్బందిపై కేసు నమోదు చేయించి,దర్యాప్తు కొనసాగుతోందన్నారు. తిరుమలలో యాంటీడ్రోన్ సిస్టమ్ తీసుకుని వస్తున్నామని ఇఓ వెల్లడించారు. గదుల కేటాయింపులో ఇప్పటివరకు 71.41కోట్లు ఆదాయం లభించిందన్నారు. తిరుమలలో ఉద్యోగులకు కేటాయించిన 850 గదుల్లో 650 గదులను వెనక్కుతీసుకుని సామాన్యభక్తులకు కేటాయిస్తున్నామన్నారు. శ్రీవారికి లక్షరూపాయలు విరాళాలిచ్చే భక్తులు తక్కువఅని, లక్షరూపాయలు విరాళాలిచ్చిన భక్తులకు దర్శనం, గదులు ఇచ్చే వెసలుబాటు ఉండేదన్నారు. ఇంకా ఇప్పటివరకు 650కోట్లు రూపాయలు ట్రస్ట్‌ద్వారా విరాళాలు అందినట్లు ఇఓ వెల్లడించారు. శ్రీవాణి నిధులతో చేపడుతున్న 2,068 ఆలయాలను ఆరునెలల్లో పూర్తిచేస్తామని ధర్మారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో నిరాదరణకు గురైన ఆలయాల్లో దూపదీప నైవేద్యాల కోసంఆలయ కమిటీ బ్యాంకు అకౌంట్‌లో 5వేల రూపాయలు జమ చేస్తున్నామన్నారు. ఇందుకోసం 12.50కోట్ల రూపాయలు విడుదల చేశామన్నారు .ఇప్పటివరకు 650కోట్లు రూపాయలు ట్రస్ట్‌ద్వారా విరాళాలు అందినట్లు ఇఓ వెల్లడించారు. విద్యాసంస్థల్లో పలు సంక్షేమ చర్యలు చేపట్టి, టిటిడి పాఠశాలలతోబాటు కళాశాలల్లో నాణ్యమైన విద్యాబోధన, సకల సౌకర్యాలు కల్పించామని ఇఓ ధర్మారెడ్డి వెల్లడించారు. ఇంకా స్విమ్స్,బర్డ్ ఆస్పత్రుల్లో పేదలకు అత్యుత్తమ వైద్యసేవలను అందిస్తున్నామని,డిసెంబర్ నాటికి ప్రపంచస్థాయి క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటుకానుందని తెలిపారు.పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో ఉచిత గుండె శస్త్రచికిత్సలు,గుండె మార్పిడి వెయ్యివరకు చేయడం జరిగిందన్నారు.

# 'యువగళం'కు ముమ్మర ఏర్పాట్లు

**- కుప్పం నుండి ఇచ్ఛాపురం వరకు 400 రోజులు 4 వేల కిమీ నడక**

**- ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పాదయాత్ర**

**- ఈ నెల 27న కుప్పంలో శ్రీకారం**



చిత్తూరు, జనవరి 23 ప్రభాతవార్త:

2024 సార్వత్రిక ఎన్నికలు లక్ష్యంగా చేసుకొని ప్రజలతో మరింత సన్నిహితమై వారి కష్టాలు తెలుసుకోవడానికి జాతీయ తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేష్ ఈ నెల 27న తెలుగుదేశం పార్టీకి కంచుకోట, జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నియోజకవర్గం కుప్పం నుండి 'యువగళం' పాదయాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. యువగళం పాదయాత్ర ప్రారంభించడంపై ప్రత్యేక దృష్టి పెట్టిన తెలుగుదేశం నాయకులు ఇప్పటికే కుప్పంలో మకాం చేసి యువగళం పాదయాత్రను విజయవంతం చేయడానికి ఏర్పాట్లు ముమ్మరం చేశారు. యువగళం పాదయాత్రతో నారా లోకేష్ 125 నియోజకవర్గాల పరిధిలో 400 రోజుల పాటు పాదయాత్ర చేసి 4 వేల కిమీ పాటు నడవడానికి పక్కా ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ నెల 27న కుప్పం నియోజకవర్గంలో ప్రారంభమయ్యే నారా లోకేష్ యువగళం పాదయాత్ర రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ముగియనుంది. తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ యువగళం పాదయాత్ర ప్రారంభ కార్యక్రమంను భారీ విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు ఇప్పటికే కుప్పంలో మకాం వేసి యువగళం పాదయాత్ర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ నెల 27న కుప్పంలో యువగళం పాదయాత్ర ప్రారంభానికి ఒక రోజు ముందు నారా లోకేష్ తిరుమల చేరుకొని వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకొని వారి ఆశీర్వాదం పొంది కుప్పంకు వచ్చి పాదయాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నారా లోకేష్ యువగళం పాదయాత్ర అన్ని నియోజకవర్గాలు కవర్ అయ్యేలా రూట్ మ్యాప్‌ను పార్టీ అధిష్టానం సిద్ధం చేసింది. నారా లోకేష్ ఈ యువగళం పాదయాత్రలో రోజుకు 10 కిమీ పాటు నడవనున్నారు. కుప్పం నియోజకవర్గంలో ఈ నెల 27వ తేదీ ప్రారంభం అయ్యే నారా లోకేష్ పాదయాత్ర ఆ నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో కొనసాగనుంది. మొదటి రోజు కుప్పం, రెండవ రోజు శాంతిపురం, మూడవరోజు రామ కుప్పం చల్లిగానిపల్లి, గుడిపల్లి మండలాల్లో జరుగనుంది. ఆపై పలమనేరు నియోజక వర్గంలోకి నారా లోకేష్ అడుగు పెట్టనున్నారు. ఆ నియోజకవర్గం అనంతరం నారా లోకేష్ పూతలపట్టు, చిత్తూరు, గంగాధరనెల్లూరు, నగరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, తిరుపతి, చంద్రగిరి, పుంగనూరు, పీలేరు, మదనపల్లి, తంబళ్ళపల్లి నియోజకవర్గాల పరిధిలో యువగళం పాదయాత్ర పూర్తి చేసుకొని అనంతపురం జిల్లాలోకి అడుగు పెట్టనున్నారు.

## నారా లోకేష్

## రేపు శ్రీవారి దర్శనానికై తిరుమల రాక

*- హైదరాబాద్ నుంచి కడప.. అనంతరం తిరుమల..ఆపై కుప్పం !!*

*కుప్పం, జనవరి 23 ప్రభాతవార్త*

*తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి , ఎమ్మెల్సీ నారా లోకేష్‌తో పాటు నారా, నందమూరి కుటుంబాలు ఈనెల 25న రాత్రి తిరుమలకు చేరుకోనున్నారు. 26న ఉదయం శ్రీవారిని దర్శించుకున్న అనంతరం నారా లోకేష్ నేరుగా కుప్పంకు విచ్చేస్తారు. 25వతేది మధ్యాహ్నం1.20 గంటలకు నారా లోకేష్ హైదరాబాదు జూబ్లీహిల్స్‌లోని తమ నివాసం నుంచి బయలుదేరి నేరుగా ఎన్టీఆర్ ఘాట్‌కు చేరుకుంటారు. అక్కడ 2.15గంటల వరకు దివంగత ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించిన అనంతరం 3.15గంటలకు షంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారని తెలిసింది. అక్కడ నుంచి నేరుగా 4.30గంటలకు కడప చేరుకుంటారు. కడపలో అమీన్‌పీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం 6గంటలకు కడప నగరంలోని రోమన్ క్యాథలిక్ కేథిడ్రల్ చర్చికి చేరుకుంటారు. అనంతరం అక్కడ నుంచి సాయంత్రం 6.30గంటలకు బయలుదేరి రాత్రి 10గంటలకు తిరుమలలోని జిఎంఆర్ అతిథిగృహంకు చేరుకుని విశ్రాంతి తీసుకుంటారు. 26న ఉదయం తిరుమలలో శ్రీవారిని 8-30గంటలనుంచి 9.30గంటల వరకు దర్శించుకుంటారు. అనంతరం 10.30గంటలకు తిరుమలనుంచి బయల్దేరి మధ్యాహ్నం 2.30గంటలకు కుప్పం ఆర్అండ్‌బి అతిథిగృహానికి చేరుకు ంటారని తెలిసింది. 26న కుప్పంలో పార్టీ శ్రేణులతో సమావేశం కానున్నారు.*

### పాదయాత్రపై ఎలాంటి ఆంక్షలు లేవు : ఎస్పీ రిశాంత్‌రెడ్డి



చిత్తూరు, జనవరి 23 ప్రభాతవార్త:

జాతీయ తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రపై ఎలాంటి ఆంక్షలు లేవని ఎస్పీ రిశాంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు నారా లోకేష్ యువ గళం పాదయాత్రకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. అయితే నిబంధనలకు లోబడి యువగళం పాదయాత్ర చేయాలని ఎస్పీ తెలుగుదేశం పార్టీ నాయకులకు స్పష్టం చేశారు. అలాగే యువగళం పాదయాత్రలో ఎక్కడా ప్రజలను రెచ్చగొట్టే వాఖ్యలు చేయకూడదన్నారు.

## స్పందనకు అర్జీల వెల్లువ

చిత్తూరు, జనవరి 23 ప్రభాతవార్త:

ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ హరినారాయణన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంకు జిల్లా నలుమూలల నుండి 233 మంది ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందజేశారు. ప్రజల నుండి అందిన అర్జీలను పరిశీలించిన కలెక్టర్ హరినారాయణన్ సత్వరం సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### రహదారి భద్రతా వారోత్సవాల నేపథ్యంలో

# మోటార్ బైక్ ర్యాలీ

### జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి



తిరుపతి క్రైం, జనవరి 23, ప్రభాతవార్త

జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఎస్వీ ఆర్స్ కాలేజ్ నుంచి బాలాజీ కాలనీ గాంధీ రోడ్డు నాలుగు కాల మండపం మున్సిపల్ ఆఫీస్ వరకు బైక్ ర్యాలీ రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కొరకు మోటార్ బైక్ ర్యాలీని ట్రాఫిక్ పోలీసు నిర్వహించారు. ప్రజలకు, వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై రోడ్డు ప్రమాదాల భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ ర్యాలీ ద్వారా అవగాహన కల్పించాలని ట్రాఫిక్ పోలీస్ వారి రోడ్డు రవాణా శాఖ వారి ముఖ్య ఉద్దేశ్యమన్నారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసు విభాగం వారు తిరుపతి జిల్లా రోడ్ రవాణా శాఖ కలిసి సంయుక్తంగా జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు 2023 పై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం ఎస్వీ ఆర్ట్స్ కాలేజ్ నుండి మున్సిపల్ ఆఫీసు వరకు మోటర్ బైక్‌ర్యాలీని నిర్వహించారు. తిరుపతి నగరంలో ఉన్న ప్రజలకు, టాక్సీలు ఆటో డ్రైవర్లలకు, వాహనదారులకు ట్రాఫిక్ నియమ నిబందనపై అవగాహన ఉండాలని అలాగే వాహనాలు నడిపే సమయంలో నిబంధనలు పాటిస్తూ హెల్మెట్, సీట్ బెల్ట్ వేసుకున్నాకే ప్రయణిచాలడం, మంచిందని ప్రతి ఒక్కరూ స్పీడ్ లిమిట్ పాటించి నిర్దేశించిన స్పీడ్ లోనే ప్రయాణించాలే తప్ప అంతకు మించి స్పీడ్‌తో ప్రయాణించినట్లైతే విలువైన ప్రాణాలు కోల్పోవాల్సి విన్నవించారు. ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నియమ నిబంధనలు తెలుసుకుని రోడ్డు ప్రమాద నివారణ కొరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించి వాహనదారులు సురక్షితంగా ఉండాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా రవాణా శాఖ అధికారి సీతారామిరెడ్డి, తిరుపతిట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస రావు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్స్ కుసుమ, ట్రాఫిక్ ఎస్ఐలు, ట్రాఫిక్ సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.

# 26 నుండి తిరుపతి జిల్లాలో ప్లాస్టిక్ నిషేధం

**జనవరి 26 నుండి తిరుపతి జిల్లాలో ప్లాస్టిక్ నిషేధం - ప్లాస్టిక్ అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి**

**-ప్లాస్టిక్‌ను వినియోగిస్తే చర్యలు : కలెక్టర్ వెంకటరమణారెడ్డి**




తిరుపతిరూరల్, జనవరి23 ప్రభాతవార్త:

పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో తిరుపతి జిల్లాలో నిషేధించాలని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి అధికారులను ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లు నిషేధ కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరములో కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యులు, మునిసిపల్ కమిషనర్లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేసిన సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పర్యావరణశాఖ ఆదేశాల మేరకు జీఓ ఎంఎస్‌నెం 65, జీవోఎంఎస్ 75 ప్రభుత్వ నిబంధనల మేరకు ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లు నిషేధ కార్యక్రమాన్ని జనవరి 26 గణతంత్ర దినోత్సవం రోజు నుండి పటిష్టంగా అమలు చేసే విధంగా చూడాలన్నారు. ప్లాస్టిక్ ఇయర్ బడ్స్, ప్లాస్టిక్ బెలూన్స్, ప్లాస్టిక్ జెండాలు, ప్లాస్టిక్ క్యాండి స్టిక్స్, ప్లాస్టిక్ ఐస్‌క్రీమ్స్ స్టిక్స్, అలంకరణ కోసం వినియోగించడం జీవో ఎంఎస్ 81 ప్రకారం నిషేధమని తెలిపారు. ప్లాస్టిట్ వినియోగం పర్యావరణానికి ప్రజా ఆరోగ్యానికి హానికరమని, ప్లాస్టిక్ వినియోగం కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, డిపిఓ రాజశేఖర్‌రెడ్డి, డిఎల్‌డిఓ సుశీలాదేవి, శ్రీకాళహస్తి, పుత్తూరు, సూళ్ళూరుపేట మునిసిపల్ కమీషనర్లు బాలాజీ నాయక్, కెఎల్ఎన్ రెడ్డి, నరేంద్రకుమార్, అసిస్టెంట్ కమీషనర్ కమర్షియల్ టాక్స్ హరీష్ కుమార్, కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి నరేంద్రబాబు, డిప్యూటీ కమీషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి పొల్యూషన్ బోర్డు ఈ.ఈ.నరేంద్రకుమార్, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ప్రతాప్, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ, జిల్లా రవాణాధికారి సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఉష్ణోగ్రతలు

23/1/2023



- తిరుపతి 27 డిగ్రీలు
- చిత్తూరు 30 డిగ్రీలు
- మదనపల్లి 23 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 29 డిగ్రీలు
- వెంకటగిరి 30 డిగ్రీలు
- గూడూరు 30 డిగ్రీలు

### బంగారం ధరలు

23/1/2023



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 5, 235

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,711

### కోడిగ్రుడ్ల ధరలు

23/1/2023



కోడిగ్రుడ్డు :రూ.6.00

1 డజను: రూ.72.00

### రైల్వేస్టేషన్‌లో

## రైల్వే పోలీసుల తనిఖీలు



రేణిగుంట, జనవరి 23 ప్రభాతవార్త:

ప్రయాణికుల భద్రత కోసం రైల్వే పోలీసులు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటారని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, జీఆర్పీ పోలీసులు సంయుక్తంగా తెలిపారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లోసోమవారం సాయంత్రం రైల్వే ప్రొటెక్షన్ ఫోర్సు డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ మురళీకృష్ణ, జీఆర్పీ డివిజన్ ఎస్పీ చౌడేశ్వరి ఆదేశాల మేరకు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, జీఆర్పీ పోలీసులు సంయుక్తంగా భద్రతా చర్యల్లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో స్టేషన్ మొత్తం విస్తృతంగా తనిఖీలు చేశారు. ప్రతి సంవత్సరం రిపబ్లిక్‌డే సందర్భంగా ముందస్తు భద్రత చర్యలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు చేస్తారు. ఆటంకవాదుల కదలికలు గుర్తించడానికి రైల్వే ఆస్తులు కాపాడడానికి ప్రయాణికుల సంరక్షణ కోసం ఇలాంటి చర్య చేపడతారు. రైల్వే స్టేషన్ బుకింగ్ ఆఫీస్ వద్ద, ప్లాట్‌ఫాంపైన బయలుదేరుతున్న రైళ్ళలో, ప్లాట్‌ఫాంకు చేరుకున్న రైళ్ళలో, విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీ రిహార్సల్స్‌లో పోలీస్ డాగ్స్ కీలక పాత్ర పోషించాయి. ఎక్కడ ఏ వస్తువులు ఉన్నాయో చక్కగా గుర్తించాయి. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ రాజు, తిరుపతి ఆర్‌పీఎఫ్ సీఐ మధుసూదన్, తిరుపతి జీఆర్పీ డీఎస్పీ షాను, జీఆర్పీ సీఐ హేమ సుందర్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# పరీక్షా కేంద్రం ఒకటైతే మరో కేంద్రానికి హాజరు

**ఆలస్యం అవుతుందని ఆందోళనతో కింద పడ్డ మహిళా అభ్యర్థి**

**స్పందించిన ఎంటిఓ ఆర్ఐ మధు**

**పోలీసు వాహనంలో మహిళా అభ్యర్థిని పరీక్షా కేంద్రానికి తీసుకెళ్ళిన వైనం**



**పోలీసు రాత పరీక్షలో మహిళా అభ్యర్థికి సహాయపడిన ఎంటిఓ ఆర్ఐ మధుకు క్యాష్ రివార్డును అందిస్తున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి.**

చిత్తూరు, జనవరి 23 ప్రభాతవార్త:

జిల్లా కేంద్రం చిత్తూరులో ఆదివారం జరిగిన పోలీసు కానిస్టేబుల్ అర్హత రాత పరీక్షలో పరీక్షా కేంద్రం ఒకటైతే మరో పరీక్షా కేంద్రంకు హాజరైన ఓ మహిళా అభ్యర్థిని అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంటిఓ ఆర్ఐ మధు సకాలంలో స్పందించి ఆ మహిళా అభ్యర్థిని కేటాయించిన పరీక్షా కేంద్రంకు సకాలంలో తీసుకెళ్ళి తన మానవత్వం చాటుకొన్నాడు. ఈ విషయం తెలుసుకొన్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఎంటిఓ ఆర్ఐ మధుకు సోమవారం క్యాష్ రివార్డును బహుకరించారు. జిల్లా కేంద్రం చిత్తూరులో ఆదివారం 33 పరీక్షా కేంద్రాల్లో పోలీసు కానిస్టేబుల్ అర్హత రాత పరీక్ష నిర్వహించారు. ఇందులో ఎస్వీసెట్ కళాశాలతో పాటు సీతమ్స్ కళాశాల సైతం పరీక్షా కేంద్రాలుగా వున్నాయి. ఒక మహిళా అభ్యర్థి సీతమ్స్ కళాశాలలో పోలీసు కానిస్టేబుల్ రాత పరీక్షకు హాజరు కావాల్సి వుంది. అయితే పొరబాటును ఆ మహిళా అభ్యర్థి ఎస్వీసెట్ పరీక్షా కేంద్రంకు వెళ్ళిపోయింది. పరీక్ష ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సి వుండటం అప్పటికే 9.30 గంటలకు పైబడి కావడంతో త్వరగా నిర్ధేశించిన పరీక్షా కేంద్రం చేరుకొని పరీక్షా రాయాలని నిర్ణయించిన ఆ మహిళా అభ్యర్థి ఆందోళనతో ఎస్వీసెట్ కళాశాలలో కింద పడిపోయింది. అక్కడే విధుల్లో వున్న ఎంటిఓ ఆర్ఓ మధు మహిళా అభ్యర్థి వద్దకు వెళ్ళి పరిశీలించగా హాల్‌టికెట్‌లో పరీక్షా కేంద్రం సీతమ్స్ కళాశాల అని వుండటంతో హుటాహుటిన ఆ మహిళా అభ్యర్థిని పోలీసు వాహనంలో ఎక్కించుకొని సకాలంలో సీతమ్స్ కళాశాల పరీక్షా కేంద్రంకు చేర్పించి ఆ మహిళా అభ్యర్థి పరీక్ష రాయడానికి సహాయపడ్డాడు. పరీక్ష అనంతరం ఆ మహిళా అభ్యర్థి ఎంటిఓ ఆర్ఐ మధును కలిసి తాను పరీక్షకు హాజరు అయ్యేలా చూసినందుకు కృతజ్ఞతలు తెలిపింది. ఈ విషయం ఎస్పీ రిశాంత్‌రెడ్డికి తెలియడంతో పరీక్షా కేంద్రం మారిపోయి అవస్థలు పడుతున్న మహిళా అభ్యర్థిని మానవతా దృక్పదంతో నిర్ధేశించిన పరీక్షా కేంద్రంలో పరీక్షకు హాజరయ్యేలా చేసిన ఎంటిఓ ఆర్ఐ మధును అభినందించారు. ఈ మేరకు సోమవానం ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఎంటిఓ ఆర్ఐ మధుకు క్యాష్ రివార్డును అందజేశారు.

